క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

జి.కొండూరు: మండలంలోని కుంటముక్కలలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సతీసమేతంగా పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠ జరిగిన బాలత్రిపరాసుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, సీతా రామచంద్రస్వామి ఆయంతో పాటు గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన బొడ్డురాయి వద్ద ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, శిరీష దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పలు జాతీయ స్థాయి సాంకేతికోత్సవాల్లో ప్రతిభ కనబరచి బహుమతులు సాధించినందుకు కళాశాల యాజమాన్యం అభినందించింది. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయా బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కళాశాల కార్యదర్శి సుబ్రహ్మణ్యం ప్రశంసాపత్రాలు అందజేశారు. ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సాంకేతికోత్సవంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన డీ మాలిక్ బాషా, అక్షయ్‌కుమార్, సాయివెంకట్, ఎం.ప్రతాప్‌లను, గుడివాడ వీకేఆర్ వీఎంబీ కళాశాలలో ప్రాజెక్టు ఎగ్జిబిషన్లో ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన సాయి వెంకట్, హైదర్‌హుసేన్, పవన్‌కల్యాణ్‌ను అభినందించారు.

నేడు శ్రీ పుష్పయాగం

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజు శుక్రవారం శ్రీ పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ తెలిపారు. ఉదయం ఆరు గంటలకు స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు, నవ ఫల రసాలతో అభిషేకం, తదుపరి నూతన వస్త్రాలు స్వర్ణాభరణాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, అనంతరం ఉత్సవమూర్తులకు శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు(12 సేవలు), రాత్రి 10 గంటలకు పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

రేపు కంటి ఆపరేషన్ల శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రా బ్యాంక్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటల నుంచి గొల్లపూడి మైలరాయి సెంటర్‌లోగల ఆషా హాస్పిటల్‌లో ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాన్ని నిర్వహించనున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ పట్టాభి మెమోరియల్ పేరుతో పేదలకు ఉచిత కంటి పరీక్షలను చేయనున్నట్లు సంఘం కో–ఆర్డినేటర్ వీ జగన్ మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బీఏ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డ్ తీసుకు రావల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఓటుకు ఆధార్ నమోదు పూర్తిచేయండి

ఇబ్రహీంపట్నం: ఓటుకు ఆధార్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కొండపల్లి మున్సిపాల్టీలోని 53 బూత్‌లకు సంబంధించిన బూత్‌లెవల్ అధికారుల అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదులో ఇప్పటి వరకు వచ్చిన 6–బి ఫారాల వెరిఫికేషన్ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎం.సూర్యారావు పాల్గొన్నారు.

బాబా ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి



షాబూఖారీ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఖాదర్‌బాషా, మతగురువు ఆల్తాఫ్‌రజా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): హజ్రత్ సయ్యద్ షాబూఖారీ బాబా ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ భాషా ఆకాంక్షించారు. కొండపల్లిలోని షాబూఖారీ దర్గాను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సూఫీ మతగురువు ఆల్తాఫ్ రజా ఆయనకు స్వాగతం పలికారు. బాబాకు చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. పేదల అన్నదాన కేంద్రం లంగర్‌ఖానా పరిశీలించారు. అన్నదా నం చేస్తున్న ఆల్తాఫ్ రజాను సత్కరించారు. అనంతరం ఖాదర్ భాషాను సన్మానించారు. జిల్లా ఖాజీ హబీబుల్లా హుస్సేనీ, ముస్తాక్, యూనిస్ పాల్గొన్నారు.

భోజన నాణ్యతపై తనిఖీలు

మునునూరు: జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో అధికారులు పాఠశాలలను, మధ్యాహ్న భోజన, నాణ్యతలపై తనిఖీలు చేపట్టారు. ఎంఈఓ రత్నకుమార్ సీఆర్పీలతో కలసి రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లిల్లోని పాఠశాలల్లో, మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు.

ఇంటింటికీ కుళాయి నీరు

- 15వేల ఇళ్లకు నీరందించే ఏర్పాట్లు
- రూ.80 కోట్లతో పైపులైన్ల నిర్మాణం



తిరువూరు మండలంలో పైపులైన్ల నిర్మాణ పనులు



జలజీవన్‌మిషన్ కుళాయి కనెక్షన్లు బిగిస్తున్న కార్మికులు

తిరువూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరందించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం సన్నాహాలు చేస్తోంది. గతంలో ఉన్న పంపింగ్ స్కీములు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, బోర్లతో పాటు అవసరమైన గ్రామాల్లో, ఆవాస ప్రాంతాల్లో కొత్తగా డైరెక్టు పంపింగ్ స్కీములు, ఫిల్లరు పాయింట్లను నిర్మించి, కుళాయి నీరు సరఫరా చేయాలని భావిస్తున్నారు. తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 72 గ్రామాలుండగా, 91 పనులను రూ.80 కోట్లతో చేపట్టారు. రూ.5 లక్షల లోపు వ్యయమయ్యే పథకాలను నామినేషన్ ప్రాతిపదికన ఇప్పటికే దాదాపు పూర్తి చేయగా, రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చయ్యే తాగునీటి పథకాలకు టెండర్లు పిలిచారు. పైపులైన్లు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉండగా, ఎక్కడ కొత్తగా పంపింగ్ స్కీములు అవసరమో గుర్తించారు.

అన్ని ఇళ్లకూ కుళాయిలు

గ్రామాల్లో ఎటువంటి డిపాజిట్ చెల్లించకుండానే ప్రైవేటు కుళాయి కనెక్షన్లను జలజీవన్ మిషన్ పథకంలో ఏర్పాటు చేయనున్నారు. ఇంతకు ముందు పంచాయతీకి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ముందుగా డిపాజిట్ చెల్లిస్తేనే ప్రైవేటు కుళాయిలు మంజూరు చేస్తుండగా, ఇప్పుడు పూర్తిగా ఉచితంగా ఈ కనెక్షన్లు వేయనున్నారు. గతంలో కుళాయిలు ఉన్న నివాసగృహాలు మినహా నూరుశాతం ఇళ్లకు రక్షిత మంచినీరందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. పైపుల ఏర్పాటుకు అవసరమైన గోతులు తవ్వించడంతో పాటు అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులను గుర్తించారు. 2024 నాటికి లక్ష్యాన్ని అధిగమించాలని అధికారులు కృషిచేస్తున్నారు.

మండలాల వారీగా	మంజూరైన కుళాయిలు
తిరువూరు	– 2,400
గంపలగూడెం	– 8,200
విస్సన్నపేట	– 1,800
ఏకొండూరు	– 2,400
మొత్తం	– 14,800

పనులు జరుగుతున్నాయి

తిరువూరు సబ్ డివిజన్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ఏర్పాటు కార్యక్రమం చురుకుగా సాగుతోంది. గ్రామాల్లో ఉన్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు నీటి వనరులను గుర్తించాం. పైపులైన్ల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేసి అడిగిన వారందరికీ కుళాయి కనెక్షన్లు మంజూరు చేస్తాం.

– స్వామినాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తిరువూరు

వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వ్యవసాయ బోర్లు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: వైఎస్సార్ జలకళ పథకం సన్న, చిన్నకారు రైతులకు వరం అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని సిద్ధార్థనగర్, సుంకొల్లు, యనమదల గ్రామాలకు చెందిన రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద 28 బోర్లను ప్రభుత్వం మంజూరు చేయగా, సిద్ధార్థనగర్‌లో జలకళ కింద బోర్లు వేసే కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ శ్రేయస్సు కోసమే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసాతో పాటు వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేసి రైతులకు ఉచితంగా వ్యవసాయ బోరును ఏర్పాటు చేయడంతో పాటు మోటార్‌ను, విద్యుత్ కనెక్షన్‌ను సైతం ఉచితంగా అందించి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లోని రైతులు సాగు చేస్తున్న పంటలకు సాగునీటి ఇబ్బందులు తొలగుతున్నాయన్నారు. సిద్ధార్థనగర్ ప్రాంతంలోని గిరిజనులకు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోను, ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ అటవీ హక్కుల చట్టం కింద పట్టాలను ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ భూముల్లో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం బోర్లను మంజూరు చేసిందన్నారు. ఒకచోట నీళ్లు పడకపోయినా మరొకచోట డ్రిల్లింగ్ చేసి బోరును వేయనున్నట్లు తెలిపారు. ఐదెకరాల లోపు రైతులకు ఈ పథకాన్ని అమలు చేస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వెంకటాయపాలెం, సుంకొల్లు, సిద్ధార్థనగర్, యనమదల, కొత్తూరు తండా సర్పంచ్‌లు డోలా ప్రభాకర్, దుడ్డు నాగమల్లేశ్వరరావు, బాణావతు చిలకమ్మ, వరికూటి వెంకటేశ్వరరావు, మూడు శ్రీను, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ, రాంబాబు, రవి, కిషోర్ పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

ఆగిరిపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడే ప్రగతి సాధించగలమని కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కె.మరియమ్మ అన్నారు. స్థానిక కేడీసీసీ బ్యాంకులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో బ్రాంచి సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భూసారానికి అనుగుణంగా పంటల సాగు

మునుకుళ్ల(తిరువూరు): రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని, తదనుగుణంగా సాగు చేయాల్సిన పంట ఎంపిక చేసుకోవాలని ఎనీఆర్ జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ మోనీషా సూచించారు. మండలంలోని మునుకుళ్లలో గురువారం నిర్వహించిన పొలంబడిలో రైతులకు పంటల సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. ఏఓలు పద్మ, టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

మైలవరం: మహిళా సాధికారత సాధించాలంటే ప్రతి స్త్రీ విద్య, శారీరక, మానసిక ఆరోగ్యం, ఆశావాద దృక్పథం అనే అంశాలపై దృష్టి పెట్టాలని హ్యూమన్ రైట్స్ సెల్ ప్రసిడెంట్ కోయ సుధ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కోయ సుధ మాట్లాడుతూ తల్లిదండ్రు లు తమ పిల్లల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

కల్యాణమస్తు పథకం పంపిణీ

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం గ్రామానికి చెందిన ఓబిళ్లనేని వరప్రసాదు కుమార్తెకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కల్యాణమస్తు పథకాన్ని అందజేశారు. కార్యక్రమంలో తిరువూరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ టి.సాంబశివరావు, పాలక వర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు పాల్గొన్నారు.

వెన్నుపోటుదార్లతో అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

జి.కొండూరు: స్వపక్షంలోనే ఉంటూ విపక్ష నాయకులతో కలిసి పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతున్న కొందరు నాయకులతో పార్టీ శ్రేణులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వెల్లటూరులో రైతుల విభిన్న అవసరాల కోసం నాబార్డు నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ను ఎమ్మెల్యే వసంత, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కేడీసీసీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్రరాణాతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఇదే గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేడీసీసీ ప్రోసెసింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న ప్రభుత్వ విధానాలతో వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని వ్యక్తులు, అధికార పార్టీలో చీలికలు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రభుత్వానికి ప్రజా మద్దతు ఉన్నంతకాలం దుష్టశక్తుల ఆట సాగదన్నారు. వెల్లటూరులో రూ.6 కోట్లతో అతి త్వరలో లెదర్ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పరిశ్రమ వల్లన వేయి మందికిపై ఉపాధి పొందుతారన్నారు. అదేవిధంగా కందులపాడు గ్రామం నుంచి వెల్లటూరు మీదుగా నాగులూరు వరకు రూ.44 కోట్లతో రహదారి విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభించ నున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రో త్సాహాన్ని సద్వినియోగపరుచుకుని ప్రతిఒక్కరూ సీఎంకు మద్దతుగా నిలవాలన్నారు. కేడీసీసీ చైర్మెన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



కోకిలంపాడు(తిరువూరు): మండలంలోని కోకిలంపాడులో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే కే రక్షణనిధి గురువారం భూమిపూజ చేశారు. గతంలో గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు మూడు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదన పంపగా, ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, సర్పంచ్ రాధా మాధవి పాల్గొన్నారు.

సంక్షిప్తం

మహిళలను చైతన్యవంతం చేయాలి

మైలవరం: మహిళా పోలీస్‌లు గ్రామీణ మహిళలను చైతన్యవంతం చేయాలని జడ్జీ షేక్ షిరీన్ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా సుప్రీం కోర్టు జాతీయ న్యాయ సేవాదికార సంస్థ ఆదేశాల మేరకు వారం రోజులు పాటు మహిళలను చైతన్యం చేసే విధంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మూడో సచివాలయంలో మహిళా పోలీసులు, వలంటీర్లతో గురువారం సదస్సు జరిగింది. జడ్జి షేక్ షిరీన్ ప్రసంగిస్తూ దేశంలో స్త్రీని పూజించే, గౌరవించే దేశంగా ఉన్నా అనునిత్యం మహిళలపై పురుషుల ఆధిపత్యం కొనసాగుతూనే ఉందన్నారు. దీనికి కారణం మహిళలు నిరక్షరాస్యతేనన్నారు.

సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో జాతీయ సదస్సు

నూజివీడు: పట్టణంలోని సిద్ధార్థ బీ ఫార్మసీ కళాశాలలో గురువారం 'ది రోల్ ఆఫ్ నానో మెటీరియల్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. సదస్సును ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షులు ఆచార్య రఘునాథరావు ప్రారంభించారు. సెమినార్‌లో భాగంగా హైదరాబాద్ ఐఐటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఆచార్య సీహెచ్ సుబ్రహ్మణ్యం నానో పార్టికల్స్ వల్ల భవిష్యత్ తరాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమానికి ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కార్యదర్శి ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు అధ్యక్షత వహించారు. కళాశాల చైర్మన్ మోహన్‌రావు, ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా బార్ అసోసియేషన్ ఎన్నిక

నూజివీడు: నూజివీడు బార్ అసోసియేషన్ ఎన్నికకు గురువారం పలువురు న్యాయవాదులు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల అధికారి లింగమనేని రాజారావు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. ఒక్కొక్క పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో బార్ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుంది. అధ్యక్ష పదవికి ఇందుపల్లి సత్యప్రకాష్, ఉపాధ్యక్ష పదవికి రాణిమేకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పదవికి మదుపల్లి మధురవిశంకర్, జాయింట్ సెక్రటరీ పదవికి అక్కినేని వెంకట రమాకుమారి, కోశాధికారి పదవికి మల్లవల్లి రమేష్, గ్రంథాలయాధికారి పదవికి పొన్నపల్లి దుర్గారావు, మహిళా ప్రతినిధిగా నండూరి పద్మాంజలి నామినేషన్లు అందజేశారు. నామినేషన్ల స్వీకరణకు సమయం ముగిసిన నేపథ్యంలో బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లేనని న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఈ నెల 13న ప్రకటించే అవకాశం ఉంది.

తూర్పు గోదావరి చరిత్రలో తొలి ఎమ్మెల్సీ

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మాదిగ సామాజిక వర్గం బొమ్మి ఇస్రాయేలుకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారని ఇబ్రహీంపట్నం ఎస్సీ సెల్ నాయకులు గురువారం పేర్కొన్నారు. 70ఏళ్ల ఉమ్మడి గోదావరి జిల్లాల చరిత్రలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేదన్నారు. ఇప్పుడు ప్రాతినిధ్యం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ సెల్ నాయకులు నల్లమోతు ప్రకాష్, ఎస్.దయాకర్, పచ్చిగోళ్ల పండు ఏపీ అసెంబ్లీ ఎన్నికల కార్యాలయంలో ఇస్రాయేలును కలిశారు.

డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఊటుకూరు/సత్యాలపాడు(గంపలగూడెం): ప్రభుత్వ పాఠశాలల్లో డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నందిగామ ఉప విద్యాశాఖ అధికారి గౌరీ శంకర్ తెలిపారు. గంపలగూడెం మండలంలోని ఊటుకూరు, పెనుగొలను, సత్యాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతిలో తక్కువ శ్రేణీ విద్యార్థులను బీ గ్రేడ్ వచ్చేలా అదనపు క్లాసులను నిర్వహించాలన్నారు.

ముగ్గురుకు ఉపాధ్యాయులపై విచారణ

ఆరోపణలు, అవకతవకలు నేపథ్యంలో ఈ ఏడాది సస్పెండ్ అయిన పిదప డీఈఓ ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా తిరిగి విధులకు హాజరవుతున్న ముగ్గురు ఉపాధ్యాయులపై డీవైఈఓ విచారణ చేపట్టారు. గాదెవారిగూడెం పాఠశాలకు చెందిన కొల్లి కృష్ణయ్య, కోట హరికృష్ణ, మల్లెంపాడు పాఠశాలకు చెందిన నేరెళ్ల రంగనాథులను విచారిస్తున్నట్లు డీవైఈఓ తెలిపారు. వారి నుంచి తగిన సమాచారం లిఖితపూర్వకంగా తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఆదేశానుసారం వారిపై చర్యలు ఉంటాయన్నారు. డీవైఈఓ కార్యాలయం సీసీ హరిస్వామినాయక్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

మునునూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సమగ్ర సేవలు అందించాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని కొర్లగుంట గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చేలా కేంద్ర ప్రభుత్వ చట్టాలు

మైలవరం: కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చేలా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో తన మంద బలంతో పాస్ చే సిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మైలవరం సీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో సీఐటీయూ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య సదస్సు సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేల ఇవ్వాలని పేర్కొన్నారు.

రూ.28.85 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే రక్షణనిధి



లబ్ధిదారులకు అందిన సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పెనుగొలను(గంపలగూడెం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంపలగూడెం మండలం పెనుగొలను–1 సచివాలయం పరిధిలో అభివృద్ధి సంక్షేమ పథకాలతో రూ.28.85కోట్ల ఖర్చు చేసినట్లు తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. పెనుగొలను–1 సచివాలయం పరిధిలో నాల్గో రోజు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని బీసీ కాలనీ, మెయిన్ బజార్లలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా ప్రాంత వాసులకు చేకూరిన లబ్ధి వివరించడంతో పాటు ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నివేశన స్థలాలు, కాలనీ గృహాలు, మంజూరు చేయాలని, సిమెంట్ రోడ్లు, పక్క డ్రెయినేజీ నిర్మాణం, చేపట్టాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా రామాలయం సెంటర్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం సందర్భంగా ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సచివాలయం గ్రాంటు రూ.20 లక్షలతో పాటు, ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలు కేటాయించి గ్రామంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు భవిష్యత్‌లో కూడా కొనసాగింపు జరగాలంటే 2024లో సాధారణ ఎన్నికల్లో ఓటర్లు మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బలపర్చాల్సి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, సర్పంచ్ లలిత, ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

జేజేఎంతో నీటి సమస్యల పరిష్కారం

వినగడప(గంపలగూడెం): జలజీవన్ మిషన పథకంతో గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారం అవుతుందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం వినగడపలో రూ.51లక్షలతో జల జీవన్ మిషన్ పథకంలో 60 వేల లీటర్ల సామర్థ్యం వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ విస్తరణ, ఉచిత కుళాయి కనెక్షన్ల ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ నిధుల్లో రూ. 33లక్షలతో వాటర్ ట్యాంక్, రూ.18లక్షలతో పైపులైన్ లేని ఎస్సీ కాలనీలో 400 మీటర్లు, వినగడప మెయిన్‌లో రూ.800లీటర్ల పొడవునా పైపులైన్ ఏర్పాటుగ్రామంలో ట్యాప్ కనెక్షన్లు లేని 150 గృహాలకు ఉచితంగా కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం



ప్రారంభించనున్న ప్రభుత్వ భవనాలు

తునికిపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం తునికిపాడులో రూ.79.30 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తిరువూరు, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు కొక్కిలిగడ్డ రక్షణనిధి, సామినేని ఉదయభాను, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్నెస్ సెంటర్ల భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం భగవాన్లపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొంటారని తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



సీఈ అశోక్‌కుమార్‌రెడ్డిని కలిసిన కమిషనర్ వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీకి ఎన్టీటీపీఎస్ సంస్థకు సంబంధించిన ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.అశోక్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఎన్టీటీపీఎస్ పరిపాలనా భవనంలో సీఈని కమిషనర్ గురువారం కలిశారు. ఎన్టీటీపీఎస్ ఆస్తిపన్ను చెల్లించి మున్సిపాల్టీ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. స్పందించిన ఆయన పది రోజుల్లో ఆస్తిపన్ను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో–కన్వీనర్లు సైనికుల్లా పనిచేసి ప్రతిపక్ష పార్టీలు చేసే దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో నియోజకవర్గంలోని సోషల్ మీడియా కన్వీనర్లు, కో–కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా సోషల్ మీడియా విభాగం కీలకపాత్ర పోషించాలన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఏలూరు జిల్లా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నిత్యం అసత్యాలను ప్రచారం చేస్తోందని, వాటిని అసత్యాలుగా నిరూపిస్తూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను సూటిగా ప్రజల వద్దకు తీసుకెళ్లవచ్చన్నారు.

ఆలస్యంగా పరీక్షకు హాజరైన విద్యార్థుల నిలిపివేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆలస్యంగా వచ్చిన 54 మంది విద్యార్థులను పరీక్ష రాసేందుకు అనుమతించని ఘటన గురువారం చోటుచేసుకుంది. జి.కొండూరు మండలంలోని శ్రీవాణి ఫార్మసీ కళాశాల జేఎన్‌టీయూ కాకినాడకు అనుబంధంగా కొనసాగుతోంది. బీఫార్మసీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కోర్సు చివరి పరీక్షలను నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులకు పరీక్షా కేంద్రంగా విజయవాడలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థను కేటాయించారు. గురువారం రెండో పరీక్షకు విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమైతే శ్రీవాణికి చెందిన విద్యార్థులు 10.27 నిమిషాలకు పరీక్షహాల్‌కు చేరుకున్నారు. వారిని లోనికి వెళ్లనీయకుండా నిలిపివేశారు. కేంద్రం నిర్వాహకులు జేఎన్‌టీయూ కాకినాడ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్షకు అనుమతించవద్దని ఆదేశించారు. వారి ఆదేశాలతో కేంద్రం నిర్వాహకులు విద్యార్థులను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బస్సు ఆలస్యంగా రావడంతోనే పరీక్షకు సకాలంలో హాజరుకాలేకపోయినట్లు విద్యార్థులు పే ర్కొన్నారు. పరీక్షలో 30 మార్కులకు సంబంధించిన బిట్ పేపర్ ఉంటుందని, ఒకవేళ అనుమతించినట్లయితే మాస్ కాపీయింగ్‌కు అవకాశముంటుందని విశ్వవిద్యాలయం అధికారులు భావించి ఈ నిర్ణయం తీసుకొని ఉంటారని కేంద్రం నిర్వాహకులు పేర్కొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

తిరుమల కరుణాకర్ S/o. వెంకట శ్రీమన్నారాయణ, కనసానపల్లి, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా వారికి గొల్లపూడి, విజయవాడ రూరల్ మండలం, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయబడిన ఫ్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 514/1993ను జిరాక్స్ కాపీలు తీయించుకుని ఆగిరిపల్లి నుండి కనసానపల్లి వెలుతుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించగలరు.

రైతులకు చేతిసంచుల పంపిణీ

మల్లేల(తిరువూరు): మండలంలోని మల్లేల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులైన రైతులకు కేడీసీసీ బ్యాంకు సరఫరా చేసిన చేతి సంచులను గురువారం పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా రైతులందరికీ ఈ చేతిసంచులను అందజేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్ రవికుమార్ తెలిపారు.